సాక్షి
నల్లగొండ
మంగళవారం ၊ 1 ၊ అక్టోబర్ ၊ 2024



'చిల్లర' కష్టాలు
మార్కెట్లో చిల్లర సమస్య తీవ్రంగా మారింది. ఏ దుకాణంలోకి వెళ్లినా చిల్లర దొరకడం లేదు. - 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం : 590 అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	: 588.90 అడుగులు
ఇన్‌ఫ్లో	: 49.651 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 49.651 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29.435 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 10.425 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 6.791 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2.400
వరద కాల్వకు	: 600

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం : 643.82 అడుగులు

ఇన్‌ఫ్లో	: 1,175 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 1,175 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 315 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 315 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

లా పరీక్షలు వాయిదా

నల్లగొండ రూరల్ : న్యాయశాస్త్రం 3వ, 5వ సంవత్సరాల కోర్సు రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు మహాత్మాగాంధీ యూనివర్సిటీ పరీక్షల కన్వీనర్ ఉపేందర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలను నిర్వహించే తేదీని త్వరలో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

నల్లగొండ టూటౌన్ : విద్యార్థులు తమకు నచ్చిన క్రీడలను ఎంపిక చేసుకుని వాటిలో రాణించాలని డీఈఓ భిక్షపతి సూచించారు. సోమవారం నల్లగొండలోని ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లాస్థాయి క్రికెట్ ఎంపిక పోటీలను ప్రారంభించి మాట్లాడారు. ఈనెల 3న జరిగే ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో విజయం సాధించాలని ఆకాంక్షించారు. పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారిని ఉమ్మడి జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి వాసుదేవరావు పాల్గొన్నారు.

ప్రతి రోగికి రక్త పరీక్షలు చేయాలి



రక్త పరీక్షలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

మునుగోడు : జ్వరం, ఇతర అనారోగ్య సమస్యలతో వైద్యశాలలకు వచ్చే ప్రతి రోగికి రక్త పరీక్షలు చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) శ్రీనివాస్ ఆదేశించారు. సోమవారం మునుగోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి పరిసరాలు, సిబ్బంది చేసిన రక్త పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది నిత్యం అప్రమత్తంగా ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. సీజనల్ వ్యాధుల నివారణకు అవసరమైన జిల్లా కేంద్రం నుంచి మందులు తెప్పించుకోవాలన్నారు. అక్కడే ఉన్న హోమియోపతి ఆసుపత్రిని పరిశీలించి అందులో చికిత్స పొందుతున్న రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డాక్టర్ మాధురి, హోమియోపతి వైద్యురాలు శృతి ఉన్నారు.

ప్రతిభను వెలికితీసేందుకు అచీవ్‌మెంట్ టెస్ట్

చిట్యాల : విద్యార్థుల్లో దాగిఉన్న పతిభను వెలికితీసేందుకే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే టెస్ట్ నిర్వహిస్తున్నామని జిల్లా కామన్ బోర్డు (డీసీబీ) సెక్రటరీ కొమ్ము శ్రీనివాస్, అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ (ఏఎంఓ) రామచంద్రయ్య నాయక్ అన్నారు. చిట్యాల పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే టెస్ట్‌ను సోమవారం వారు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ సైదానాయక్, హెచ్ఎంలు కొసనం కరుణాకర్‌రెడ్డి, అంబటి సత్తయ్య, ఉపాధ్యాయులు మంజుల, సుధాకర్‌రెడ్డి, భిక్షపతి, ప్రత్యేక బోధన ఉపాధ్యాయులు బోయ శ్రీనివాసులు, సీఆర్పీ జయకాంత్, జాన్ కిషోర్, ప్రవళిక పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ డీలర్ల సంఘం నాయకులు

నల్లగొండ : రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ రేషన్ డీలర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని, క్వింటాకు కమిషన్ రూ.300కు పెంచాలని, ఎంఎల్ఎస్ పాయింట్లలో ఎలక్ట్రానిక్, ప్రింటెడ్, వేబ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని, రూ.10 లక్షల ఇన్సూరెన్స్ అమలు చేయాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, దిగుమతి హమాలి ఖర్చు ప్రభుత్వమే భరించాలని, ఒక శాతం తరుగు ఇవ్వాలని గ్రామాలు, పట్టణాల్లో ప్రభుత్వ స్థలంలో రేషన్ దుకాణాల నిర్వహణకు స్థలం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యుల సత్యనారాయణ, కోటగిరి సూర్యనారాయణ, కొర్ర శంకర్‌నాయక్, సత్తిరెడ్డి, పగిల్ల వెంకటేశ్వర్లు, మునీందర్‌రావు, లక్కీనాయక్, మంచుకొండ విజయ్‌కుమార్, కలీం, అశోక్, బాల్‌రెడ్డి, శ్రీనివాస్, నరసింహ, భవాని ప్రసాద్, సుధాకర్‌రెడ్డి, రాము, పర్వతాలు, మురళికృష్ణ, యాదయ్య, హెచ్.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



ఉల్లాసంగా.. ఉత్సాహంగా
నల్లగొండలోని మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డేలో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

డీఎస్సీ ఫలితాలు విడుదల

- నేటి నుంచి సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నల్లగొండ : డీఎస్సీ-2024 ఫలితాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ఈ ఏడాది జూలై, ఆగస్టు మాసంలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన పరీక్షల్లో జిల్లా వ్యాప్తంగా ఆయా కేటగిరీల్లో (ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్) పలువురు అభ్యర్థులు పరీక్షలు రాశారు. అర్హత సాధించిన అభ్యర్థుల జాబితాను జిల్లాల వారీగా విద్యాశాఖ విడుదల చేసింది. జిల్లాల వారీగా 1:3 నిష్పత్తి ప్రకారం ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్లను నేటి నుంచి 5వ తేదీ వరకు పరిశీలించనున్నట్లు డీఈఓ భిక్షపతి తెలిపారు. నల్లగొండలోని డైట్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని.. ఒరిజినల్స్‌తో పాటు రెండు సెట్ల జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

కష్టాల కడలిలో గెస్ట్ లెక్చరర్లు

- చాలీచాలని వేతనాలతో ఏళ్ల తరబడి బోధన
- ప్రభుత్వాలు మారినా మారని తలరాతలు
- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్



విద్యా బోధన చేస్తున్న గెస్ట్ లెక్చరర్

రామగిరి(నల్లగొండ) : ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లు కష్టాలతో కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వాలు మారినా తమ తలరాతలు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలీచాలని వేతనాలతో విద్యా బోధన చేస్తున్నామని.. ఎన్నికల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నారు.

జిల్లాలో 111 మంది..

నల్లగొండ జిల్లాలో ఏడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాల్లో 111 మంది గెస్ట్ లెక్చరర్లు పనిచేస్తున్నారు. ప్రతి సంవత్సరం ఆయా కాలేజీల్లో ఉన్న ఖాళీలను బట్టి నోటిఫికేషన్ వేసి నియమకాలు చేపడతారు. ఏడాదిలో 6 నుంచి 8 నెలలు మాత్రమే వీరికి పనిదినాలు ఉంటాయి. పని లేని రోజుల్లో వేతనాలు ఇవ్వరు. రెగ్యులర్, కాంట్రాక్టు అధ్యాపకుల మాదిరిగా వీరు కూడా విద్యాబోధన చేస్తున్నా.. సరైన వేతనం ఇవ్వడం లేదు. ఆ నెలలో వచ్చే క్లాసులను బట్టి వీరికి వేతనం ఇస్తున్నారు. ప్రస్తుతం ఒక్కో పిరియడ్‌కు రూ.390 చెల్లిస్తున్నారు. నెలకు 72 పీరియడ్ల కంటే ఎక్కువ ఇవ్వరు. ఒక వేళ 72 పీరియడ్లు అయినా వస్తాయా అంటే అదీ లేదు. సెలవులు పోను వచ్చిన పనిదినాల్లో వచ్చిన పీరియడ్లు అంతంత మాత్రమే. దీంతో వారికి సరిపడా వేతనాలు అందడం లేదు. చాలీచాలనీ వేతనాలతో పొట్ట చేతుల పట్టుకుని సంసారాలు నెట్టుకొస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ హామీని అమలు చేయాలి



డిగ్రీ కాలేజీల్లో ఏళ్ల తరబడి బోధన చేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ డిగ్రీ గెస్ట్ లెక్చరర్లకు నెలకు రూ.52 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. ఆ హామీ మేరకు వేతనాలు పెంచాలని, ఏటా షరతులు లేకుండా పాత వారిని కొనసాగించాలని కోరుతున్నాం.

– గొడుగు గోవర్ధనగిరి, గెస్ట్ లెక్చరర్

వస్తోంది.. ఎమ్మెల్సీ ఎన్నిక

మొదలైన టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోలాహలం

టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోలాహలం మొదలైంది. వరంగల్–ఖమ్మం– నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి పదవీకాలం వచ్చే ఏడాది మార్చి 29వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియను ప్రారంభించింది. అందులో భాగంగా ఓటరు నమోదుకు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. మరోవైపు యూటీఎఫ్, ఎస్టీయూ తదితర ఉపాధ్యాయ సంఘాలు తమ సంఘం సభ్యత్వ నమోదును వేగవంతం చేయగా, పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గాల నియామకాల్లో బిజీ అయింది.

- ఓటరు నమోదు నోటిఫికేషన్ విడుదల
- నవంబర్ 6వ తేదీ వరకు ఓటర్ల నమోదు ప్రక్రియ
- ఈసారి పెరుగనున్న ఓటర్ల సంఖ్య
- మద్దతు కోసం ఆశావహుల ప్రయత్నాలు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా సోమవారం నుంచి ఓటరు నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. అర్హులైన టీచర్లు ఇప్పటి నుంచి నవంబరు 6వ తేదీ వరకు ఓటు నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. గత ఎన్నికల ఓటరు జాబితాను ఎన్నికల సంఘం రద్దుచేసింది. ప్రతి ఉపాధ్యాయుడు మళ్లీ కొత్తగా ఓటు నమోదు చేసుకోవాల్సి ఉంది. ఇప్పటికే ఉపాధ్యాయ సంఘాల్లో సభ్యత్వ నమోదు జోరందుకుంది. గత రెండు నెలల నుంచి యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ముమ్మరంగా కొనసాగిస్తోంది. ఎస్టీయూ, టీపీయూఎస్ సంఘం కూడా సభ్యత్వ నమోదును కొనసాగిస్తోంది. పీఆర్‌టీయూ రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కమిటీలకు ఎన్నికలు నిర్వహించే పనిలో పడింది. అక్టోబరు 7వ తేదీన రాష్ట్ర కమిటీ ఎన్నికలు నిర్వహించబోతోంది. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా కార్యకవర్గం ఎన్నికలను వారం క్రితం నిర్వహించింది. పూర్తిస్థాయిలో జిల్లా బాడీ నియామకం కాగానే సభ్యత్వ నమోదుపై దృష్టి సారించేలా ఆ సంఘం ముందుకు సాగుతోంది.

పెరగనున్న ఓటర్ల సంఖ్య

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఈసారి ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గతంలో జరిగిన ఎన్నికల్లో వరంగల్, ఖమ్మం, నల్లగొండ మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలో 20,888 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈసారి సంఘాలు, నేతలు ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించారు. పెద్ద ఎత్తున నమోదుచేయించేందుకు సిద్ధమయ్యాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు హైస్కూల్‌లో పని చేసే టీచర్లతోపాటు పాటు యూనివర్సిటీలో పనిచేసే అధ్యాపకులంతా ఓటు కోసం తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. అలాగే కొన్ని నిబంధనల మేరకు ప్రైవేటు టీచర్లు ఓటు కోసం నమోదు చేసుకునే అవకాశం ఉంది. అయితే మూడేళ్ల పాటు వరుసగా సర్వీసు రిజిస్టర్‌లో వారి పేర్లు ఉండి, యూడైస్‌లో వివరాలు నమోదై ఉండి, వేతనాలు బ్యాంకు అకౌంట్ ద్వారా పొందుతూ, పీఎఫ్ కట్ అయ్యే ప్రైవేటు టీచర్లు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో వారిని నమోదు చేయించేందుకు కసరత్తు ప్రారంభించిన నేపథ్యంలో ఈసారి ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి బరిలో వీరు..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఈసారి కూడా పోటీ చేయనున్నారు. మరోవైపు పీఆర్‌టీయూ మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ కూడా ఈసారి పోటీచేయనున్నారు. ఇప్పటికే మూడు జిల్లాల్లోని సంఘం నేతల మద్దతు కూడగట్టుకునే పనిలో పడ్డారు. గత ఎన్నికల్లో తాను ఓడిపోయినా సంఘంతోనే ఉన్నానని, తనకు అవకాశం కల్పించాలని ఇప్పటికే ఆయన రాష్ట్ర సంఘానికి తెలియజేశారు. అయితే, పీఆర్‌టీయూ నుంచి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి పేరు కూడా వినిపిస్తోంది. టీపీయూఎస్ తరపున సూర్యాపేట జిల్లాకు చెందిన సాయిరెడ్డి కూడా బరిలో దిగేందుకు సిద్ధమవుతున్నారు. టీపీయూఎస్ బీజేపీ అనుబంధ సంఘం అయిన నేపథ్యంలో పార్టీ నిర్ణయం కూడా కీలకం కాబోతోంది. పీఆర్‌టీయూ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పులి సరోత్తంరెడ్డి పోటీ చేసేందుకు తన ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయన ప్రస్తుతం బీజేపీలో ఉన్న నేపథ్యంలో పార్టీ ఎవరికి మద్దతు ఇస్తుందన్నది తేలాల్సి ఉంది.

ఊడిపడిన పెచ్చులు.. ఉద్యోగుల పరుగులు

నల్లగొండ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పెచ్చులూడిన స్లాబ్



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఊడి పడిన పెచ్చులు

నల్లగొండ : నల్లగొండ మున్సిపల్ క్వార్టర్స్‌లో నిర్మిస్తున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సోమవారం స్లాబ్ పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఆ సమయంలో ఉద్యోగులు, రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన భయాందోళన చెందారు. భవనం కూలుతుందేమోనన్న ఆందోళనతో కార్యాలయం బయటకు పరుగులు తీశారు. పాతకాలం నాటి భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కొనసాగుతుంది. పాత భవనం నిర్వహణ సరిగా లేకపోవడంతో పదేపదే స్లాబ్ పెచ్చులు ఊడిపడుతున్నాయి. వర్షం వస్తే భవనం లీకై నీరు వచ్చి ఉద్యోగులు విధులు నిర్వహించలేని పరిస్థితి ఉంటుంది. ఈ భవనాన్ని మార్చాలని ఆ శాఖ అధికారులు గతంలో కలెక్టర్‌కు విన్నవించారు. వేరే చోటుకు మారుస్తామని చెప్పినా అది అమలుకు నోచుకోలేదు. సోమవారం కార్యాలయం పెచ్చులూడటంతో అధికారులు.. మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కార్యాలయాన్ని కమిషనర్ పరిశీలించారు. ఈ విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. తాత్కాలికంగా భవనాన్ని వేరేచోటుకు మార్చి పక్కా భవనాన్ని నిర్మిస్తామని ఆయన హామీ ఇచ్చినట్లు తెలిసింది.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండ క్రైం : జిల్లాలోని పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో ఎస్‌ఐలు, సీఐలు, డీఎస్పీలతో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ పూర్తి చేయాలన్నారు. చోరీ, దొంగతనం కేసుల్లో పురోగతిని సాధించాలన్నారు. నేరం చేసిన వ్యక్తులు శిక్షనుంచి తప్పించుకోకుండా అన్ని విధాలుగా సాంకేతిక ఆధారాలను జోడించాలన్నారు. ప్రతి కేసులో కీలకమైన ఆధారాలు సేకరించి నేరస్తులకు శిక్ష పడేలా చేస్తేనే బాధితులకు భరోసా కలుగుతుందన్నారు. కీలక కేసుల్లో న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పంక్షనల్ వర్టికల్స్‌ను పటిష్టంగా అమలు పరుస్తూ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలన్నారు. గ్రామాల్లో సీసీ కెమెరాలపై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. పాత నేరస్తుల కదలికపై నిఘా ఉంచాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, గంజాయి, పేకాట, ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణ జరగకుండా ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ రాములు నాయక్, డీఎస్పీలు రమేష్, శివరాంరెడ్డి, రాజశేఖర్‌రాజు, గిరిబాబు, సైదా, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తు చేయాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ శరత్‌చంద్ర పవార్

పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును సమగ్రంగా దర్యాప్తు చేసి బాధితులకు భరోసా కల్పించాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఆయన పిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. ప్రతి పిర్యాదును ఆన్‌లైన్‌లో పొందుపరిచి పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

పంటల నమోదు పూర్తిచేయాలి

నల్లగొండ అగ్రికల్చర్ : వ్యవసాయాధికారులు పంటల నమోదును డిజిటల్‌గా చేయాలని జిల్లా వ్యవసాయాధికారి పాల్వాయి శ్రవణ్‌కుమార్ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంటల నమోదు డిజిటల్ ప్రక్రియను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. పంటల నమోదులో నిర్లక్ష్యం చేస్తే శాఖా పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదే విదంగా అక్టోబర్ 5వ తేదీన పీఎం కిసాన్ 18వ విడత నిధులు విడుదల చేయనున్నందు.. ప్రతి రైతువేదికలో రైతులతో సమావేశం నిర్వహించాలన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : న్యాయబద్ధంగా ఉన్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. ప్రజావాణి సందర్భంగా సోమవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 74 మంది బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదులను అందజేశారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గ్రామాల్లో రోజూ శానిటేషన్ నిర్వహించేలా చూడాలని మండల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. వచ్చేవారం మొక్కలపై ఆడిట్ జరుగుతుందని.. పల్లెప్రకృతి వనాలు, ప్రభుత్వ సంస్థలు, రహదారులకు ఇరువైపులా తప్పనిసరిగా మొక్కలు ఉండాలన్నారు. గ్రామాల్లో జ్వరాలు వచ్చినవారిని ఆశవర్కర్లు మందులు ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరికి ఆధార్‌కార్డు ఉన్నట్టుగానే, ప్రతి కుటుంబానికి డిజిటల్ కార్డు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా.. వివరాల సేకరణకు జిల్లా అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణఅమిత్, డీఎఫ్‌ఓ రాజశేఖర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో 65 శాతం ప్రసవాలు

గవర్నమెంట్ దవాఖానాలకు క్యూ కడుతున్న గర్భిణులు

- వసతులు మెరుగు పర్చిన ప్రభుత్వం
- నల్లగొండ జీజీహెచ్‌లో రికార్డు స్థాయిలో కాన్పులు



2023 ఏప్రిల్ నుంచి 2024 సెప్టెంబరు 30 వరకు కాన్పుల వివరాలు

ప్రసవం	ప్రభుత్వ	ప్రైవేటు
సాధారణ	8674	2610
సిజేరియన్	8905	11318
మొత్తం	**17579**	**13928**



జీజీహెచ్‌లో వైద్య పరీక్షల కోసం బారులుదీరిన గర్భిణులు (ఫైల్)

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగింది. గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేయించుకోవాలంటే గర్భిణులు భయపడేవారు. ఇప్పుడు దానికి భిన్నంగా ప్రభుత్వ ఆస్పత్రులకు క్యూకడుతున్నారు.గతంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో 60 శాతం.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో 40 శాతం మాత్రమే జరిగేవి. ప్రభుత్వ ఆస్పత్రులను ఆధునీకరించడం, సకల సదుపాయాలు కల్పించడం, అన్ని రకాల వైద్య పరీక్షల కోసం పరికరాలను అందుబాటులో ఉంచడంతో గర్భిణులు ప్రసవాల కోసం పెద్దసంఖ్యలో తరలివస్తున్నారు. ప్రస్తుతం 65 శాతం కాన్పులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరుగుతుండగా.. ప్రైవేట్ ఆస్పత్రుల్లో 35 నుంచి 40 శాతం జరుగుతున్నాయి.

అవసరమైన సిబ్బంది నియామకం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి 24 గంటల పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కాన్పుల సంఖ్య పెంచాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి. అందుకోసం ఆస్పత్రులకు అవసరమైన గైనకాలజిస్టులు, స్టాఫ్ నర్సులను నియమించారు. దీంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో పాటు మిర్యాలగూడ, నాగార్జునసాగర్, దేవరకొండ ఏరియా ఆసుపత్రులు, నకిరేకల్, మిర్యాలగూడ సీహెచ్‌సీలు, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల కోసం వస్తున్న వారి సంఖ్య పెరిగింది. పీహెచ్‌సీ స్థాయిలో గర్భిణులను నమోదు చేసుకోవడం, మూడు నెలలు నిండిన తర్వాత చెకప్‌ల కోసం ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు నెల వారీగా తీసుకొస్తున్నారు. కాన్పు సమయం రాగానే ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ చేయిస్తున్నారు.

పెరిగిన సాధారణ ప్రసవాలు..

ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేస్తున్న కాన్పుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య ఎక్కువగా ఉండడం శుభ పరిణామంగా చెప్పవచ్చు. 2023 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో 31,507 కాన్పులు జరగ్గా కేవలం జీజీహెచ్‌లోనే రికార్డుస్థాయిలో 10,460 కాన్పులు జరిగాయియి. వీటిలోసాధారణ కాన్పులు 5,521 కాగా.. 4,939 సిజేరియన్లు ఉన్నాయి.

మెరుగైన వైద్యం అందుతుంది

ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్నిరకాల మౌలిక సదుపాయాలు కల్పించి మెరుగైన వైద్యం అందిస్తున్నాం. పీహెచ్‌సీ స్థాయిలోనే గర్భిణులను నమోదు చేసి నెలనెలా చెకప్ చేస్తున్నాం. అక్కడ కాన్పు జరిగే అవకాశం లేకుంటే ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు దగ్గరుండి వారిని ఏరియా ఆస్పత్రి, జీజీహెచ్‌కు తీసుకెళ్తున్నారు. అందుకే గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రులకు వస్తున్నారు.

– పుట్ల శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ నల్లగొండ

'బతుకమ్మ, దసరా'కు ప్రత్యేక బస్సులు



నల్లగొండ రూరల్: ఉమ్మడి జిల్లాలో ప్రయాణికుల సౌకర్యార్థం బతుకమ్మ, దసరా పండుగలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని 7 డిపోల నుంచి 639 బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రయాణీకుల రద్దీని బట్టి బస్సుల సంఖ్యను పెంచుతామన్నారు. నేటి నుంచి 11వ తేదీ వరకు, 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. బస్సుల వివరాల కోసం ప్రయాణికులు కింద నంబర్లను సంప్రదించాలని సూచించారు. మిర్యాలగూడ డిపో- 8689241111, నల్లగొండ- 8682283622, సూర్యాపేట- 7382943819, హైటెక్ బస్టాండ్- 9494926625, కోదాడ- 9959226302, నార్కట్‌పల్లి - 9848584198, దేవరకొండ- 9490510752, యాదగిరిగుట్ట- 73828 36087

క్లుప్తంగా

ద్విచక్ర వాహనం చోరీ

నకిరేకల్: మున్సిపాలిటీ కేంద్రంలోని పటేల్‌నగర్‌లో ఓ ఇంట్లో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. పటేల్‌నగర్‌లో నివాసముంటున్న గడుసు కోటేశ్వరరెడ్డి రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి తన ఇంటి లోపల బైక్‌ను పార్కింగ్ చేశాడు. గేటుకు తాళం వేయలేదు. సోమవారం ఉదయం లేచి చూడగా బైక్ కనిపించలేదు. బైక్ చోరీకి గురైనట్లు గ్రహించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

భువనగిరి బస్టాండ్‌లో గుండెపోటుతో వ్యక్తి మృతి


మృతిచెందిన భిక్షపతి

భువనగిరి క్రైం: భువనగిరి బస్టాండ్‌లో సోమవారం గుండెపోటుతో ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం చందుపట్ల గ్రామానికి చెందిన అంబటి భిక్షపతి(63) టైలరింగ్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం సోమవారం అతడు హైదరాబాద్‌కు వెళ్లేందుకు భువనగిరి బస్టాండ్‌కు వచ్చాడు. అదే సమయంలో అతడికి గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయి మృతిచెందాడు. స్థానికులు సమాచారాన్ని భిక్షపతి కుటుంబ సభ్యులకు తెలియజేయగా వారు బస్టాండ్‌కు వచ్చి మృతదేహాన్ని చందుపట్లకు తీసుకెళ్లారు.

నేడు అక్సా మసీదులో జల్సా

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని బర్కత్‌పురలో గల అక్సా మసీదులో మహ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం జయంతి సందర్భంగా మంగళవారం సాయంత్రం 6గంటలకు సీరతున్నబి (ప్రవక్త జీవిత చరిత్ర) అనే అంశంపై జల్సా నిర్వహించనున్నట్లు మౌలానా అబ్దుల్ బషీర్‌సాహబ్ ఓ ప్రకటనలో తెలిపారు. ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ జల్సాను విజయవంతం చేయాలని కోరారు.

చెరువులో చేపల దొంగతనానికి యత్నం

చౌటుప్పల్ రూరల్: చెరువులో చేపలను దొంగతనానికి యత్నించిన వ్యక్తులపై మత్స్య కార్మికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వలిగొండ మండలం గోకారం గ్రామానికి చెందిన కట్ట భిక్షపతి, కట్ట శ్రీశైలంతో పాటు మరో 10మంది శనివారం అర్ధరాత్రి చౌటుప్పల్ మండలం చిన్నకొండూర్ గ్రామ పరిధిలోని చెరువులో చేపలు ఎత్తుకెళ్లడానికి ఆటో, బైక్‌లపై వచ్చారు. ఈ చెరువు మందోళ్లగూడెం, తూర్పుగూడెం, చిన్నకొండూర్, పెద్దకొండూర్ గ్రామాలకు చెందిన మత్స్య కార్మికులు ఆధీనంలో ఉంది. సమాచారం అందుకున్న ఆయా గ్రామాల మత్స్య కార్మికులు చెరువు వద్దకు చేరుకోగా.. దొంగతనానికి వచ్చిన వారిలో కొందరు పరారయ్యారు. మరికొంత మందిని పట్టుకుని పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. ఈ ఘటనపై పెద్దకొండూర్ గ్రామానికి చెందిన మోర లింగస్వామి ఆదివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా ఈ ఘటనపై కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ కృష్ణమాల్ సూర తెలిపారు.

భువనగిరి కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

- ఆరు నెలలుగా తిరుగుతున్నా ఇంటి నంబర్ కేటాయించడం లేదని ఫిర్యాదు
- నల్లా కనెక్షన్ కూడా లేదని ఆవేదన


గ్రీవెన్స్ సెల్ నుంచి జిల్లా సంపూర్ణను బయటకు తీసుకువస్తున్న పోలీసులు


రోదిస్తూ సొమ్మసిల్లి పడిపోయిన సంపూర్ణ

భువనగిరిటౌన్: తన ఇంటికి నంబర్ ఇవ్వడం లేదని, నల్లా కనెక్షన్ కూడా ఇవ్వడం లేదని, ఆరు నెలల నుంచి విజ్ఞప్తి చేస్తున్నా పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదంటూ ఓ మహిళ సోమవారం భువనగిరి కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ సెల్ వద్ద ఫిర్యాదు చేయడానికి వచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామానికి చెందిన జెల్లా సంపూర్ణ గ్రామంలో తనకున్న 586 గజాల భూమిలో ఒక రూం ఇల్లు ఉంది. ఆ ఇల్లుకు సంబంధించిన పర్మిషన్ ఇచ్చి ఇంటి నంబర్ ఇవ్వాలని గ్రామ పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకున్నానని, దీనిపై కార్యదర్శి పట్టించుకోకపోవడంతో జూన్ నెలలో కలెక్టర్ కార్యాలయానికి వస్తే కలెక్టర్.. జిల్లా పంచాయతీ అధికారికి సిఫారసు చేశారని చెప్పింది. ఇప్పటికి కూడా తన ఇంటికి నంబర్ కేటాయించలేదని చెప్పింది. నల్లా కనెక్షన్ కూడా ఇవ్వడం లేదని, పక్కన ఉన్న వారి వద్ద నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నట్లు సంపూర్ణ తెలిపింది.

అర్జీ ఇచ్చేందుకు వచ్చి..

జెల్లా సంపూర్ణ తన సమస్యపై సోమవారం కలెక్టరేట్‌లో అర్జీ ఇచ్చేందుకు వచ్చింది. తన సమస్య పరిష్కారం కావడం లేదని అక్కడ బోరున విలపించింది. సొమ్మసిల్లి అక్కడే పడిపోవడంతో పోలీసులు ఆమెను గ్రీవెన్స్ సెల్ నుంచి బయటకు తీసుకువచ్చారు. బయట కొద్దిసేపు ఏడుస్తూ పడుకుంది. సంపూర్ణ అప్పటికే తన వెంట క్రిమిసంహారక మందు తెచ్చుకుంది. అక్కడే ఉన్న పోలీసులతో ఒకసారి కలెక్టర్‌తో మాట్లాడుతా అని చెప్పి మళ్లీ లోపలికి వెళ్లింది. అధికారుల వద్దకు వెళ్లి పురుగుల మందు తీసి తాగబోయే సరికి పక్కనే ఉన్న ఏఎస్‌ఐ చంద్రమ్మ వెంటనే అడ్డుకుని సంపూర్ణను బయటకు తీసుకొచ్చారు. సంపూర్ణ సమస్యపై అదనపు కలెక్టర్ స్పందించి.. జిల్లా పంచాయతీ అధికారి, గ్రామ కార్యదర్శులతో మాట్లాడారు. బాధితురాలికి వెంటనే ఇంటి నంబర్ కేటాయించాలని, నల్లా కనెక్షన్ కూడా ఇవ్వాలని సూచించారు. బాధితురాలు సంపూర్ణ తన చిన్నకుమారుడు శ్రీనివాస్‌తో కలిసి తన గ్రామానికి వెళ్లిపోయింది.

వారసత్వ గొడవతోనే ఇంటి నంబర్ ఇవ్వలేదు

చౌటుప్పల్ రూరల్: జెల్లా సంపూర్ణ కుటుంబంలో ఆస్తికి సంబంధించి వారసత్వ గొడవలు ఉండడంతోనే ఇంటి నంబర్ కేటాయించలేదని గ్రామ పంచాయతీ కార్యదర్శి బుసని జ్యోతి తెలిపారు. సంపూర్ణకు ఇద్దరు కుమారులు జ్ఞానేశ్వర్, శ్రీనివాస్ ఉన్నారని, వారి మధ్య 2015 నుంచి ఆస్తి గొడవలు జరుగుతున్నాయని, ఆస్తి గొడవలపై ఇద్దరు కుమారులు పలుమార్లు ఫిర్యాదు చేయడంతో ఇంటి నంబర్ ఇవ్వలేదని పేర్కొన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎంపీఓ ఫీల్డ్ విజిట్‌కు వెళ్లగా.. 586 గజాల స్థలంలో నిర్మించిన ఇంటిని పెద్దకుమారుడికి మ్యూటేషన్ చేయాలని సంపూర్ణ వాంగ్మూలం ఇచ్చిందని, ఆ తర్వాత పెద్దకుమారుడికి వద్దని, చిన్నకొడుకుకు చేయాలని దరఖాస్తు చేసిందని అన్నారు. కుమారులిద్దరు ఒప్పందానికి వస్తేనే ఇంటి నంబర్ ఇస్తామని చెప్పామని, నెల క్రితం డీఎల్‌పీఓ ఫీల్డ్‌కు వచ్చి నివేదిక తయారు చేశారని, కుటుంబ వారసత్వ గొడవల కారణంగా ఇంటికి నంబర్ కేటాయించలేదని, ఇందులో ఎలాంటి దురుద్దేశం లేదని పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

- బైక్‌ను ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం
- కారు కొనేందుకు కోదాడకు వెళ్లొస్తున్న యువకులు
- చిలుకూరు మండలం మిట్స్ కళాశాల సమీపంలో ఘటన


దినేష్ (ఫైల్)


వంశీ (ఫైల్)


శ్రీకాంత్ (ఫైల్)

చిలుకూరు, మిర్యాలగూడ: కారు కొనేందుకు బైక్‌పై కోదాడకు వెళ్లొస్తున్న ముగ్గురు యువకులను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో మృతిచెందారు. ఈ ఘటన సోమవారం రాత్రి సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని మిట్స్ కళాశాల సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలం ఆగామోత్కూర్ గ్రామానికి చెందిన అవిరెండ్ల శ్రీకాంత్(20), చిరుమర్తి గ్రామానికి చెందిన మల్లికంటి దినేష్ (23), వేములపల్లి మండలం మొల్కపట్నం గ్రామానికి చెందిన వల్లపుదాస్ వంశీ(22) కారు కొనేందుకు గాను బైక్‌పై కోదాడకు వెళ్లారు. కోదాడ నుంచి తిరిగి వస్తుండగా.. చిలుకూరు మండలంలోని మిట్స్ కళాశాల సమీపంలో ముక్యాల కాలువ వద్ద ఎదురుగా గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఘటనా స్థలాన్ని కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి పరిశీలించారు. పోలీసులు మృతదేహాలను కోదాడ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ రాంబాబు తెలిపారు. కాగా బైక్‌ను లారీ ఢీకొట్టినట్లు పోలీసులు భావిస్తున్నారు. కారు, లారీ మధ్య నుంచి బైక్ వెళ్లినట్లు సీసీ కెమెరాల ఆధారంగా పోలీసులు గుర్తించారు.

అక్రమంగా గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న లారీల పట్టివేత

అనంతగిరి: అక్రమంగా గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న 13 లారీలను సెప్టెంబర్ 27వ తేదీన సూర్యాపేట జిల్లా మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. ఈ విషయం సోమవారం వెలుగులోకి వచ్చింది. మైనింగ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రభుత్వ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 27వ తేదీన అనంతగిరి మండలం బొజ్జగూడెం తండా శివారులోని 365/ఏ జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహించగా.. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రానైట్ రాళ్లను కోదాడ నుంచి ఖమ్మం వైపు తీసుకెళ్తున్న 13 లారీలను మైనింగ్ అధికారులు గుర్తించి పట్టుకున్నారు. ఆయా లారీల డ్రైవర్లు పారిపోవడంతో లారీలను కోదాడ ఎంపీఐ జలీల్, అనంతగిరి ఎస్‌ఐ నవీన్‌కుమార్ సహకారంతో కోదాడలోని మైహోమ్ సిమెంట్స్ ఎస్టేట్‌కి తరలించినట్లు అసిస్టెంట్ జియాలజిస్ట్ విజయరామరాజు తెలిపారు. వారి వెంట రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. రాంమూర్తి, టెక్నికల్ అసిస్టెంట్ ఎల్. వెంకన్న, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన బొలేరో వాహనం

- ఇద్దరు మృతి, ఒకరికి గాయాలు


రాజ్‌కిషోర్‌సింగ్ మృతదేహం


బసంత బగోడి మృతదేహం

చౌటుప్పల్ రూరల్: బొలేరో వాహనం వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. మరొకరు గాయపడ్డారు. ఈ ఘటన చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం గ్రామ స్టేజీ సమీపంలో విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రం మయూర్‌బంజ్ జిల్లా బిలిజోడ గ్రామానికి చెందిన రాజ్‌కిషోర్ సింగ్(39), మయూర్‌బంజ్ జిల్లా గోవిందచంద్రపూర్‌కు చెందిన బసంత బగోడి(21), జార్ఖండ్ రాష్ట్రం పాలమో జిల్లా పత్రాయి గ్రామానికి చెందిన మనోజ్‌కుమార్(25) దండుమల్కాపురం గ్రామ పరిధిలోని అనంత సాయి క్రషర్ మిల్లులో కార్మికులుగా పనిచేస్తున్నారు. బసంత బగోడికి జ్వరం రావడంతో చికిత్స కోసం ముగ్గురు కలిసి బైక్‌పై చౌటుప్పల్ వెళ్తున్నారు. దండుమల్కాపురం గ్రామ స్టేజీ సమీపంలోని హనుమాన్ టెంపుల్ వద్దకు రాగానే వెనుక నుంచి బొలేరో వాహనం వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బసంత్‌బగోడి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందగా, రాజ్‌కిషోర్ సింగ్, మనోజ్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజ్‌కిషోర్‌సింగ్ పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఈ ఘటనపై సీఐ మన్మథకుమార్ పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చల్లా యాదవరెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతి

చౌటుప్పల్: ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆదివారం రాత్రి చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెం గ్రామ శివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా బలిజపేట మండలం గంగాడ గ్రామానికి చెందిన గుండ్ల గణేష్(40) చౌటుప్పల్ మండలం మందోళ్లగూడెం గ్రామంలో నర్సింహారెడ్డికి చెందిన పౌల్ట్రీ ఫాంలో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం పౌల్ట్రీ ఫాంలో పనిచేసే కూలీలంతా కలిసి నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకుగాను చౌటుప్పల్‌లోని వారాంతపు సంతకు ట్రాక్టర్‌లో వెళ్లారు. సరుకులు కొనుగోలు చేశాక తిరుగు ప్రయాణమయ్యారు. మార్గమధ్యలో లింగారెడ్డిగూడెం గ్రామ శివారులో రోడ్డుపై ఉన్న గుంతలను గమనించకుండా ట్రాక్టర్ డ్రైవర్ అభినందన్‌రెడ్డి అతివేగంగా నడపడంతో ట్రాక్టర్ ఇంజిన్‌పై కూర్చున్న గణేష్ ఒక్కసారిగా ఎగిరి కిందపడ్డాడు. దీంతో అతని పైనుంచి ట్రాక్టర్ ఇంజిన్ టైరు వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో మెడల్స్


మెడల్స్‌తో క్రీడాకారులు

నల్లగొండ టూటౌన్: నిర్మల్‌లో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో నల్ల గొండ పట్టణంలోని జిమ్నాస్టిక్ అకాడమీ క్రీడాకారులు పలువురు సత్తాచాటి మెడల్స్ గెలుచుకున్నారు. వివిధ విభాగాల్లో 10 మంది క్రీడాకారులు పాల్గొని ఎనిమిది మంది గోల్డ్‌మెడల్స్, ఒకరు సిల్వర్ మెడల్, మరొకరు బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు ఎస్ఎస్ కరాటే జిమ్నాస్టిక్ అకాడమీ ఫౌండర్ కోచ్ శ్రీధర్ సాగర్ తెలిపారు. మెడల్స్ సాధించిన క్రీడాకారులను సోమవారం నల్లగొండలోని అకాడమీలో రాపోలు సుదర్శన్, శ్రీధర్‌సాగర్, నగేష్ అభినందించారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్

కోదాడరూరల్ : పాలేరు వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు కోదాడ రూరల్ ఎస్‌ఐ సోమవారం తెలిపారు. కోదాడ మండలంలోని మంగళితండా, అనంతగిరి మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్లు సమీపంలోని పాలేరు వాగు నుంచి ఎలాంటి అనమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండగా.. చిమిర్యాల క్రాస్‌రోడ్ వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. పట్టుబడిన ట్రాక్టర్లను సీజ్ చేసి వాటి యాజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత


బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగిస్తున్న ఎస్‌ఐ రవీందర్‌నాయక్

నేరేడుచర్ల: పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను కనిపెట్టి సోమవారం బాధితులకు ఎస్‌ఐ రవీందర్‌నాయక్ అందజేశారు. పోతురాజు నాగమణి, గొర్ల గంగయ్య, అర్వపూడి వీరభద్రయ్య, బొంతు పద్మచంద్రారెడ్డి తమ సెల్‌ఫోన్లు చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి సెల్‌ఫోన్లను కనిపెట్టి అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

బొమ్మలరామారం: డబ్బుల కోసం వ్యక్తిని హత్య చేసిన ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మలరామారం పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఓ కేసులో డబ్బు కోసం వ్యక్తిని హత్య చేసిన కరీంనగర్ జిల్లా ధర్మారం మండలానికి చెందిన గుడికందుల శ్రీనివాస్, మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాకు చెందిన గుడికందుల శ్రీధర్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.65 వేల జరిమానా విధిస్తూ భువనగిరి సెషన్స్ న్యాయమూర్తి సోమవారం తీర్పు వెలువరించారు.

మట్టపల్లిలో పవిత్రోత్సవాలు ప్రారంభం


పవిత్రాలు గంపల్లో తెస్తున్న అర్చకులు, ధర్మకర్తలు

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం రాత్రి యాజ్ఞీకులు బొర్రా వెంకటవాసుదేవాచార్యులు పర్యవేక్షణలో పవిత్రోత్సవాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆలయంలో శ్రీ స్వామి వారి అనుజ్ఞాస్వీకారం, విష్వక్సేనారాధన , పుణ్యాహవచనం, అఖండదీపారాధన, పంచగవ్య ఆరాధన, ప్రాశన, రుత్విగ్వరణం, దీక్షాధారణ, రక్షాబంధనం, మేధినీపూజ, మత్స్యంగ్రహణం , అంకురారోపణ తదితర పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకార్చనలు, నీరాజన మంత్ర పుష్పాలు పూర్తిచేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి

- డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి


రికార్డులను పరిశీలిస్తున్న కుంభం శ్రీనివాస్‌రెడ్డి

చౌటుప్పల్ : ఖాతాదారులకు మరింతగా మెరుగైన సేవలందించాలని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. చౌటుప్పల్ పీఏసీఎస్‌ను సోమవారం ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఖాతాదారులతో మాట్లాడి బ్యాంకు ద్వారా అందుతున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్యాంకు అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని, వాణిజ్య బ్యాంకులకు దీటుగా సేవలు అందించి మన్ననలు పొందాలన్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా సహకార బ్యాంకులను వాణిజ్య బ్యాంకులకు సమానంగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట డిప్యూటీ జనరల్ మేనేజర్ కురువానాయక్, బ్యాంకు మేనేజర్ శ్రీలత ఉన్నారు.

ఏసీబీకి చిక్కిన పశువైద్యాధికారి


ఏసీబీకి చిక్కిన పశు వైద్యాధికారి జీజే పాల్

చింతపల్లి: చింతపల్లి మండల కేంద్రంలో పశువైద్యాధికారిగా విధులు నిర్వహిస్తున్న జీజే.పాల్ రూ.6 వేలు లంచం తీసుకుంటూ సోమవారం ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ జగదీష్‌చంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. చింతపల్లి మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు గేదెల కొనుగోలుకు బ్యాంకు రుణం పొందడానికి అవసరమైన హెల్త్ సర్టిఫికెట్ కోసం పశు వైద్యాధికారిని సంప్రదించాడు. అందుకు ఆయన ఆ రైతు వద్ద రూ.8 వేల లంచం డిమాండ్ చేయగా.. రూ.6 వేలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. సోమవారం ఆ డబ్బులను రైతు వద్ద నుంచి పశు వైద్యాధికారి జీజే.పాల్ తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని నాంపల్లి ఏసీబీ కోర్టుకు తరలించారు. ఈ దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు వెంకట్రావు, రామారావు, సిబ్బంది ఉన్నారు.

మహా శివుడికి అభిషేకాలు

యాదగిరిగుట్ట: యాదాద్రి ఆలయంలో సోమవారం ఆధ్యాత్మిక పర్వాలు కొనసాగాయి. కొండపై ఉన్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి క్షేత్రంలో రుద్రాభిషేకం, బిల్వార్చన నిర్వహించారు. ప్రధానాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు సుప్రభాతసేవ, ఆరాధన, నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. ముఖమండపం, ప్రాకార మండపంలో శ్రీసుదర్శన హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, సువర్ణ పుష్పార్చన, జోడు సేవోత్సవం జరిపించారు.

పాడి పశువుల ఎంపికలో జాగ్రత్తలు అవసరం



పెద్దవూర: పాడి రైతులు మేలు జాతి పశువుల ఎంపికలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని పెద్దవూర మండల పశు వైద్యాధికారి డాక్టర్ నులక నాగార్జున్‌రెడ్డి తెలిపారు. మేలు జాతి పశువులను శరీర లక్షణాలు, పశువు వంశావళి, సంతతి, పశువు ఉత్పత్తి సామర్థ్యం తదితర విషయాలను బేరీజు వేసుకుని కొనుగోలు చేయాలని ఆయన సూచిస్తున్నారు. పశువుల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఆయన మాటల్లోనే...

పశు సంతతి గుర్తింపు ఇలా..

పశువుల యజమానులు పశువు సంతతి సామర్థ్యం వాటి పాల ఉత్పత్తి ఆరోగ్య చరిత్ర తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. వీటిని బట్టి సంతానం సామర్థ్యం అంచనా వేయవచ్చు. పశువు శరీర లక్షణాలను బట్టి వాటిని కొనుగోలు చేయాల్సి ఉంటుంది. పశువుల గరిష్టస్థాయి పాల దిగుబడి పశువు ఈనిన 40–60 రోజుల లోపల ఉంటుంది. గరిష్టస్థాయికి త్వరగా చేరి, గరిష్ట స్థాయిలో ఎక్కువ రోజుల్లో పాల దిగుబడి ఇవ్వగలిగిన పశువులే లాభదాయకంగా ఉంటాయి.

మేలు జాతి పశువుల శరీర లక్షణాలు

పాడి పశువులు నిండుగా, చురుకుగా ఆడ లక్షణాలు కలిగి ఉండాలి. పాడి పశువులు సులువుగా ఉండాలి కానీ ఎద్దులాగా బాగా కండపట్టి ఉండకూడదు. శరీర అంగ సౌష్టవం త్రికోణాకారము కలిగి ఉండటంతో పాటు చర్మం పలుచగా, మృదువుగా ఉండాలి. లాగితే ముడత సులువుగా రావాలి. వదిలితే యథాస్థానంలో ఉండాలి. తేలికగా నడవగలిగి సులువుగా కూర్చుని లేవాలి. కళ్లు విశాలంగా ఉండి ముట్టె చెమ్మగిల్లి ఉండాలి. మెడ పొట్టిగాను, సన్నగాను, ఉండి ఛాతి భాగం విశాలంగా ఉండాలి. డొక్కలు నిండుగాను, కడుపు పెద్దగాను, పక్కటెముకలు బాగా వంచిన విల్లు ఆకారంలో ఉండాలి. పశువుల పిరుదుల భాగం వెనుక వైపు పొంగి ఉంటే సులభంగా ఈనగలదని గ్రహించాలి. అంతేకాకుండా కాళ్లు ధృడంగా ఉండి కాలి గిట్టలు వెడల్పుగా, గుండ్రంగా ఒక దానికి ఒకటి దగ్గరగా ఉండాలి.

పొదుగు లక్షణాలు

పొదుగు బాగా విస్తరించి శరీరానికి హత్తుకుని ఉండాలి. అంతేకాని పొదుగు సాగి వేలాడకూడదు. 18 అంగుళాల పైనే ఉండాలి. చనుకట్ల పొదుగు మీద సమానంగా అమరి ఉండటంతో పాటు పొదుగు ఇరువైపులా రక్తనాళాలు స్పష్టంగా కనిపించాలి. ఎక్కువ వంకర్లు తిరిగి ఉంటే అన్ని పాలను ఎక్కువగా ఇవ్వగలవని గుర్తించాలి.

ఇవి పరిశీలించాలి..

- పశువు జాతి లక్షణాలు, శరీర లక్షణాలు, బరువు, కొలతలు
- తండ్రి వారసత్వం, తల్లి వారసత్వం, దిగుబడి శక్తి, పునరుత్పత్తి శక్తి, గతంలో పుట్టిన దూడల శక్తి
- పశువు ఆరోగ్య పరిస్థితి, వయస్సు, ఎన్ని ఈతలు ఈనినది, దీర్ఘకాలిక వ్యాధులకు దూరంగా ఉందా లేదా గమనించాలి.
- పళ్లు శుభ్రంగా ఉన్నాయా, కాళ్లు, డెక్కల్లో బెణుకులు, విరుగుడు ఏమైనా ఉన్నాయో చూసుకోవాలి.
- చూపు సరిగా ఉందా, వట్టిదా, చూడిదా, పాడిదా గమనించాలి.
- పాడిదైతే ఎన్ని రోజుల క్రితం ఈనినది, దిగుబడి వివరాలు, వెన్నశాతం తెలుసుకోవాలి
- చూడిదైతే చూడి ఎన్ని నెలలు, ఏ ఆబోతుతో కలిపారో చూసుకోవాలి
- వట్టిదైతే ఎదకు వచ్చిందా, ఎన్నిసార్లు, ఎద నిలువలేదా, చివరిసారి వచ్చిన తేదీ, వైద్యం చేయించారా అనేది తెలుసుకోవాలి.
- ఈ లక్షణాలు ఉంటే కొనకూడదు
- తక్కువ పెరుగుదల(వయస్సుతో పోల్చితే)
- ఆలస్యంగా ఎదకు రావడం, ఎదకు రాకపోవడం
- ఈతకు, ఈతకు మధ్య హెచ్చుకాలం, నయంకాని దీర్ఘ వ్యాధులు
- మెయ్యదిగుట, పాలు తక్కువ ఇచ్చుట దూడ లేకపోతే పాలు ఇవ్వకపోవడం
- పశువుల బరువు తెలుసుకోవడం ఇలా..
- పశువుల బరువును తెలుసుకుంటే వాటికి ఇవ్వవలసిన మేతలు, దాణాలు, మందులు, సరైన మోతాదులో ఇవ్వవచ్చు.
- కాటాలో కాని, వేబ్రిడ్జీ మీద కాని తూకం వేయడం వలన బరువు స్పష్టంగా తెలుస్తుంది.
- ఎల్‌జీ 2 బై 660. ఈ సూత్రం ఆధారంగా పశువు పొడవు, ఛాతీ భాగం, చుట్టు కొలతను బట్టి బరువు తెలుసుకోవచ్చు.
- ఎల్ అనగా పశువు ముందు జబ్బ పాయింటు నుంచి వెనుక తొడల వరకు పొడుగు అంగుళాలలో
- జి అనగా పాడి పశువు ఛాతీ చుట్టుకొలత అంగుళాలలో. ఇది అన్ని పశువులకు అన్ని వయసులలో సుమారుగా సరిపోతుంది.

పశువుల కొనుగోలులో గుర్తుంచుకోవాల్సిన విషయాలు

అక్టోబర్, నవంబర్ మాసాలు పాడి పశువులను కొనటానికి అనువైన నెలలు. పశువు ఈనిన తర్వాత నెలానెలా పదిహేను రోజుల లోపల అత్యధికంగా పాల దిగుబడి ఇస్తుంది. కావున ఈనిన నెలలోపు పశువులనే ఖరీదు చేయాలి. పశువుల మొదటి 5 ఈతలలో గరిష్టస్థాయి పాల దిగుబడిని ఇస్తాయి. కావున మొదటి ఈత, రెండవ ఈత పశువులను మాత్రమే కొనుగోలు చేయాలి. ముర్రా గేదె సరాసరి 10–12 లీటర్లు, గ్రేడెడ్ ముర్రా గేదె అయితే 6–7 లీటర్ల పాలు ఇస్తే గిట్టుబాటు అవుతుంది. బెదరకుండా మచ్చికగా ఉండి మన వాతావరణానికి అలవాటు పడే పశువులను కొనుగోలు చేయటంతో పాటు ఎవరు పితికినా పాలిచ్చే పశువులను ఎంపిక చేసుకోవాలి. దీంతో పాటు పాలధారలు నిండుగా బలంగా వెలుపలికి రావాలి.